ఉపాధిహామీ గ్రామ సభలు

కొడిమ్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ, తురుకకాశీనగర్ గ్రామాలలో శుక్రవారం ఈజీఎస్ అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో అభివృద్ధి పనుల ఎంపికపై గ్రామస్థులతో చర్చించారు. నీటి సంరక్షణ పనుల, పండ్ల తోటల పెంపకం పనుల గురించి గ్రామస్థులతో చర్చించారు. ఈ గ్రామసభలలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, టీఏ భువన్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్ రావుకు పరామర్శ

జగిత్యాల టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ హైదరాబాద్‌లో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు తండ్రి సత్యానారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. హరీష్‌రావుకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామా ల్లో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం, వర్షకొండ, కేషాపూర్, కోజన్‌కోతుర్, కోమటి కొండపూర్, ఎర్దండి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికా రులు కోరారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- పాఠ్యాంశాల వారీగా ప్రణాళిక
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- మానసిక ఒత్తిడికి గురికాకుండా కౌన్సెలింగ్



జగిత్యాలలో స్టడీ అవర్స్‌కు హాజరైన విద్యార్థులు

జగిత్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ఇంటర్ బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టడానికి కసరత్తులు చేస్తోంది. అత్యంత కీలకమైన ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ఉత్తీర్ణత అంతంతే ఉంటుంది. దీన్ని అధిగమించేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అడుగేసింది. ఇందుకు 90 రోజుల ప్రణాళిక రూపొందించి అమలు చేయడానికి యోచిస్తోంది. గత యేడాది డిసెంబరు నుంచి 90 రోజుల ప్రణాళిక అమలు చేశారు. ఈసారి ముందస్తుగా నిర్వహించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం నుంచి జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు.

జిల్లాలో 42 కళాశాలలు..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు కస్తూర్బా, ఇతర గురుకుల జూనియర్ కళాశాలలు 42 వరకు ఉన్నాయి. ఇందులో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 26 ప్రభుత్వ, కస్తూర్బా, మోడల్, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, లోకల్ బాడీస్, ఇతర సంక్షేమ కళాశాలలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో సుమారు 2,950 మంది, ద్వితీయ సంవత్సరంలో సుమారు 2,430 మంది విద్యార్థులున్నారు. జూనియర్ కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ 279 మంది ఉన్నారు.


విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి...

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం సగం కూడా దాటడం లేదు. దీని ప్రభావం ఉత్తీర్ణతపై చూపి ఫలితాల శాతం తగ్గుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన ఇంటర్ విద్యాశాఖ హాజరు పెంపుపై దృష్టి సారించింది. ఇంటర్‌లో..

(మిగతా 8లో..)

గత యేడాది ఫలితాలు..

గత విద్యా సంవత్సరం ఇంటర్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 68.73 శాతం, ప్రథమ సంవత్సరంలో 56.34 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ద్వితీయ సంవత్సరంలో బాలికలు 3,137 మంది పరీక్షలకు హాజరుకాగా 2,465 మంది 78.58 శాతం ఉత్తీర్ణత కాగా, బాలురు 2,233 మంది హాజరుకాగా 1,226 మంది 54.09 శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో బాలికలు 3,550 మంది పరీక్షలకు హాజరుకాగా 2,443 మంది 68.82 శాతం ఉత్తీర్ణత కాగా, బాలురు 2,554 మంది హాజరుకాగా 996 మంది 39 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌లో 65.88 శాతం ఉత్తీర్ణత లభించగా ఇందులో బాలురు 49.78 శాతం, బాలికలు 86.82 శాతం ఉత్తీర్ణులయ్యారు.



రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ సత్యప్రసాద్



మోహన్‌రావుపేటలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల రూరల్/భీమారం అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షంతో నేలరాలిన పంటతో పాటు రంగు మారిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట, భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని దేశాయిపేట గ్రామాల్లో తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను శుక్రవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు వర్షానికి నేలకొరిగిన పంటలను పరిశీలించారు. వాతావరణ పరిస్థితులను దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని, తడిసిన ధాన్యం అరబెట్టుకోవాలని సూచించారు. కేంద్రం నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ డీఎస్‌వో జితేందర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పేదవారి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాజీపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొట్టమొదటి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, గృహ ప్రవేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మ్యాకల సరస్వతి-రాజరెడ్డికి శుభాకాంక్షలు తెలిపి, ఇంటి ఆడబిడ్డ సరస్వతికి చీర కట్నంగా అందించారు. పైలెట్ గ్రామంగా ధర్మాజీపేటను ఎంపిక చేశామని, 40 వరకు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ రావు, కోల శ్రీనివాస్, సురేందర్ నాయక్, అనుపురం శ్రీనివాస్, పాదం రాజు, రవి, శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ అండ్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు చేస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. తొమ్మిది నెలల నుంచి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి వెన్న మహేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు, కార్యదర్శి ఎండీ ముఖరం, మాడిశెట్టి కిరణ్, హనుమంతు, గుగ్గిళ్ల శారద, సరస్వతి, రాధా, పద్మ, షంసేర్, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించాలని బెదరింపులు

ధర్మపురి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఐదుగురు వ్యక్తులకు కొందరు గుర్తుతెలియని మోసగాళ్లు పన్ను చెల్లించాలని ఫోన్ చేస్తూ శుక్రవారం బెదరింపులకు పాల్పడ్డారు. మధ్యాహ్నం సుమారు 12 గంటల నుంచి రెండు గంటల లోపు సదరు వ్యక్తులకు అజ్ఞాత వ్యక్తులు స్కానర్లు పంపించి రూ. 2500 చెల్లించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు వెంటనే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇదంతా అబద్ధమని ఎవరికి డబ్బులు పంపించవద్దని కమిషనర్ ప్రకటన జారీ చేశారు. ధర్మపురి పోలీసలకు కూడా సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు. రితేష్‌రెడ్డి పేరిట స్కానర్ ఏర్పాటు చేసి 8332067220 అనే నంబర్‌తో ఫోన్ చేసినట్లు ఆయన వివరించారు.

ప్రతీ పౌరుడు దేశ సమగ్రతను కాపాడాలి





జగిత్యాలలో జెండా ఊపి రన్ ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లిలో 2 కే రన్‌లో పాల్గొన్న డీఎస్పీ రాములు, పోలీసులు, యువత, విద్యార్థులు

- ఎస్పీ అశోక్ కుమార్
- జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జాతీయ ఐక్యత దినోత్సవం

జగిత్యాల టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు దేశ సమగ్రతను కాపాడే బాధ్యతను తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం పురస్కరించుకుని రన్‌ఫర్ యునిటీ పేరుతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలో 3కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ 3కే రన్ కొత్త బస్‌స్టాండ్, ఆర్డీవో చౌరస్తా, ఓల్డ్ బస్‌స్టాండ్ మీదుగా మినీస్టేడియం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశ సమగ్రతను కాపాడే బాధ్యతను తీసుకోవాలన్నారు. రన్‌ఫర్ యూనిటీ ద్వారా దేశభక్తిని, ఐక్యతను ప్రజల్లో, యువతలో జాతీయ భావం పెంపొందించడం ప్రధాన ఉద్దేశం అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు జాతీయ స్ఫూర్తిని పెంపొందించడంలో పోలీస్‌శాఖ ఎల్లప్పుడు ముందుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, వేణు, సీఐలు రవి, కరుణాకర్, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: రాష్ట్రీయ ఏక్తా దివస్ పురస్కరించుకొని ధర్మపురి పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవీందర్‌కుమార్ తదితరులు పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ సభ్యుడు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, మండల ఇంచార్జ్ ఒగేటి అంజయ్య పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్ సందీప్, పలువురు పోలీసులు, యువకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్‌లో ఎస్‌ఐ కిరణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలకేంద్రంలో నిర్వహించిన రన్‌లో ఎస్‌ఐ రాజు, యువకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిటౌన్: పట్టణంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, బ్లాక్ అధ్యక్షుడు జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, నా యకులు పుప్పాల లింబాద్రి, ఆకుల ప్రవీణ్, పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో నిర్వహించిన ఏక్తాదివస్‌లో ఎస్‌ఐ నరేశ్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీలో ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు

రాయికల్: మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్‌లో ఏఎస్సై, పోలీసులు తిరుపతి, క్రాంతికుమార్, అశోక్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంగోని భూమా గౌడ్, ప్రధానకార్యదర్శి పొన్నంరమేష్, సభ్యులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో ఎస్‌ఐ ఉమాసాగర్, మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, గుండాటి సందీప్‌రెడ్డి, బందెల ఉదయ్ గౌడ్, యువకులు, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో నిర్వహించిన 2కే రన్‌లో ఎంపీడీవో రామకృష్ణ, ఎస్‌ఐ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన 2కె రన్‌లో మండలం నలుమూలల నుంచి తరలివచ్చిన యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బుగ్గారం: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్, పోలీస్ సిబ్బంది, నాయకులు, యువత పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామం నుంచి కథలాపూర్ వరకు పోలీసుల అధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నవీన్ కుమార్, మల్యాల మారుతి, కాసోజీ ప్రతాప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మపురిలో..

రైతులు జాగ్రత్తలు పాటించాలి

వెల్గటూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ సూచించారు. పత్తి పంటలో పంట పూత, పిందెల దశలో ఉంటే నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షం తగ్గిన వెంటనే తడి పత్తి ఏరవద్దని, మొక్కలపైనే బాగా ఆరిన తర్వాత పత్తి తీయాలని సూచించారు. తీసిన పత్తిని పొడి ప్రదేశంలో పాలిథిన్ కవర్ పైన ఆరబెట్టాలని, తడి పత్తిని నిల్వ చేస్తే బూజు పట్టి రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. వర్షం నీటిని త్వరగా కాలువల ద్వారా బయటికి పంపించాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత ఆకులపై మచ్చలు ఏర్పడితే బోరాక్స్ 1.50 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో జిల్లాలో నేరాల నియంత్రణ, విచారణ వ్యవస్థను వేగవంతం చేయడం, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం వంటి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీ షీట్స్ ఓపెన్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నేరం చేస్తే శిక్ష తప్పదు

నేరం చేస్తే ఎంతటి వారికైన శిక్ష తప్పదని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు కేసులకు సంబందించిన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసిన పీపీలు మల్లికార్జున్, కె మల్లేశ్, సీహెచ్ రామకృష్ణరావు, బి, రాజేష్, జి, ప్రణయ్‌ను ఎస్పీ అభినందించి శాలువా, ప్రశంసపత్రాలతో సత్కరించారు. గత పదినెలల్లో 103 కేసుల్లో నిందితులుగా ఉన్న 124 మందికి కోర్టు ద్వారా జైలు శిక్షలు పడ్డాయన్నారు. ఆయా సమావేశాల్లో ఎస్పీ డీఎస్పీ వెంకటరమణ, సైబర్‌క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ, డీఎస్పీలు రఘుచందర్, రాములు, రంగారెడ్డి, పీపీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

గుండెపోటుతో యువ రైతు మృతి



రాజేశం(ఫైల్)

భీమారం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన యువరైతు చుక్క రాజేశం(39) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. రాజేశం వ్యవసాయపనుల నిమిత్తం వెళ్లి, మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన తర్వాత ఛాతిభాగంలో నొప్పి వస్తోందని చెప్పగా చికిత్స నిమిత్తం తీసుకునివెళ్లగా మార్గమధ్యలోనే మరణించాడు. రాజేశంనకు భార్య రాజు, కుమారుడు నిఖిల్, కూతురు అనూహ్య ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు, మిత్రులరోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి.

ఇద్దరు గుర్తు తెలియని మహిళల మృతి



మహిళ మృతదేహం

జమ్మికుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌మీద ఓ గుర్తు తెలియని మహిళ(50) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు బ్రౌన్ కలర్ నైటీ ధరించి ఉంది. ఆమెవద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, వస్తువులు లేవు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

జగిత్యాలలో..



వృద్ధురాలి మృతదేహం

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని శ్రీరామ్ నగర్‌కాలనీలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందిందని టౌన్‌సీఐ కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం స్థానికుల సమాచారంమేరకు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించగా, 65నుంచి70ఏళ్ల మధ్య వయసున్న గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహంపడిఉంది. స్థానికులను విచారించగా, ఆమెకు సంబంధించిన సమాచారం లేకపోవడంతో మృతదేహంను జిల్లా ప్రధానాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చినట్లు సీఐతెలిపారు. వృద్ధురాలికి సంబంధించిన సమాచారం తెలిసినవారు జగిత్యాలపట్టణ పోలీసులకు 87126 56815 సమాచారం అందించాలని సీఐ సూచించారు.

- సంఘాల పునరుద్ధరణ దిశగా సర్కారు అడుగులు
- వ్యవసాయంలో కీలకం
- మెరుగుపడనున్న చెరువులు, కాలువల నిర్వహణ
- 2008 వరకు ఉమ్మడి రాష్ట్రంలో 10,748 సాగు నీటి సంఘాలు

మళ్లీ సాగు నీటి సంఘాలు



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వద్ద ఎస్సారెస్పీ కాకతీయ కాలువ

జగిత్యాల రూరల్ మండలం మోతె చెరువు

జగిత్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మరోసారి సాగునీటి సంఘాల ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభించింది. సాగు నీటి ప్రాజెక్టులపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారు దల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజకీయ నిరుద్యోగం కొంతమేర తగ్గించడంలో భాగంగా సాగు నీటి సంఘాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన క్రమంలో సాగునీటి సంఘాల ఏర్పాటుపై అన్నదాతల్లో ఆసక్తి నెలకొంది. కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులకు సంబంధించి కొత్తగా ఏర్పాటు చేయనున్న సాగు నీటి సంఘాల మార్గదర్శకాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

● నాయకులకు రాజకీయ పదవులు

నీటి వనరులను కాపాడుకోవటంతో పాటు ఉత్సాహవంతమైన నాయకత్వ లక్షణాలు ఉన్న వారికి ఈ పదవులు ఇవ్వడం వల్ల కొంత మేరకు రాజకీయ నిరుద్యోగిత తీరుతుందన్న అభిప్రాయం ఉంది. వివిధ హోదాల్లో నాయకులు ఉండటం వల్ల వారు అభివృద్ధికి కృషి చేసే అవకాశం ఉంటుంది. దీని వల్ల జిల్లాలో వందల సంఖ్యలో నీటి సంఘాల పదవులు అందుబాటులోకి వస్తాయి. గతంలో చెరువుల నీటి సంఘాలు ఉండేవి. ప్రస్తుతం ఇవి ఉనికిలో లేనందున వాటిని తిరిగి తీసుకొచ్చి సాగునీటి వనరులను కాపాడడంలో రైతులను భాగస్వాములను చేయాలని కోరుతూ రైతు సంక్షేమ కమిషన్ కోరడంతో సాగునీటి సంఘాల ఏర్పాటుకు మార్గం సుగమైంది. వీటి ఏర్పాటు వల్ల ఎప్పటికప్పుడు కాలువలను, చెరువులను బాగు చేసుకుంటూ నీటి విడుదల విషయంలో రైతులను భాగస్వామ్యులను చేసినట్లవుతుంది. ఆయా నీటి వనరుల కింద నిర్దేశించిన ఆయకట్టుకు నీరు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

• ఉనికి కోల్పోయిన సంఘాలు..

సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి నీటి వనరులను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు యాజమాన్య చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006లో ఈ పథకాన్ని ప్రారంభించారు. 2008 వరకు ఉమ్మడి రాష్ట్రంలో 10, 748 సాగు నీటి సంఘాలు ఏర్పాటు అయ్యాయి. వంద ఎకరాల్లోపు ఆయకట్టు ఉన్న చెరువులు, కుంట లకు మాత్రం సాగు నీటి సంఘాలు ఏర్పాటు కాలేదు. 2010లో నీటి సంఘాల ఎన్నికలు జరగాల్సి ఉన్నప్ప టికీ తెలంగాణ ఉద్యమం కారణంగా నిర్వహించలేదు. అప్పటికే ఉన్న పాలక వర్గాలనే కొనసాగిస్తూ ప్రత్యేక జీవోలు తీసుకువచ్చారు. తెలంగాణ ఏర్పాటు తరువాత సాగునీటి సంఘాలను ప్రభుత్వం పట్టించుకోలేదు. చెరువులను సాగునీటి సంఘాల ద్వారా కాకుండా మిషన్ కాకతీయ పేరుతో అధికారుల తోనే అభివృద్ధి చేసే కార్యక్రమం తీసుకున్నారు. దీంతో సాగునీటి సంఘాలు పూర్తిగా ఉనికిని కోల్పోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సంఘాల పునరుద్ధరణకు కసరత్తులు చేస్తోంది.

సాగు నీటి సంఘాల పునరుద్ధరణ యోచన హర్షణీయం

-వాకిడి సత్యంరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల



రాష్ట్రంలో గతంలో రద్దయిన సాగు నీటి సంఘాల వ్యవస్థ పునరుద్ధరణ ఆలోచన హర్షణీయం. సాగు నీటి సంఘాల వల్ల బహుళ ప్రయోజనాలు అందుతాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. రైతులకు అవసరమైన సాగునీటి సలహాలు, సూచనలు వేగవంతంగా అందుతాయి. వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారులపై పనిభారం సైతం తగ్గుతుంది.

ట్రాక్టర్ బోల్తా..



బోల్తా పడిన వడ్ల లోడ్ ట్రాక్టర్

శంకరపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడాటిపల్లి గ్రామంలో శుక్రవారం వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. ఓ వ్యక్తి కొనుగోలు కేంద్రంలో తన ట్రాక్టర్లో వడ్లబస్తాలు లోడ్ చేసుకొని రైస్ మిల్లుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో గుడాటిపల్లి శివారులో కెనాల్ పక్కన ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో కోతులు దాడిఘటనలో ఒకరు గాయపడ్డారు. పూసాలరోడ్డు, జవహర్ నగర్‌ప్రాంతంలో ఎల్లమల్లేశం అనేవ్యక్తి ఇంటి ఎదుటఉన్న కోతులను తరుముతుండగా అతనిపై దాడిచేసి గాయపరిచాయి. బాధితుడు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. మున్సిపాలిటీ వారు పట్టణంలో కోతుల బెడద నివారించాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అందజేత

వీణవంక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన కాసర్ల సుధాకర్ సెల్‌ఫోన్ పోగోట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని శుక్రవారం సుధాకర్‌కు అందజేశారు.

పోలీసు బందోబస్తుతో భవనం కూల్చివేత



భవనాన్ని కూల్చి వేస్తున్న ఎక్స్‌కవేటర్‌లు

మంథని, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బొక్కవాగు సమీపంలోని నద్దినాల భూమిలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎక్స్‌కావేటర్ సహాయంతో కూల్చి వేయించారు. పాత పెట్రోల్ పంపు సమీపంలోని సూరయ్యపల్లి క్రాస్ వద్ద మంథని-కాటారం ప్రధాన రహదారిని ఆనుకొని సర్వే నెం. 314లో మాజీ కౌన్సిలర్ కుర్రు లింగయ్య కుటుంబ సభ్యుల పేరిట ఎలాంటి అనుమతులు లేకుండా మొదటి అంతస్తుతో భవనాన్ని నిర్మించారు. ఈ భవన నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు విచారణ జరిపి నోటీసులు ఇచ్చారు. దీనిపై కుర్రు లింగయ్య, కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. స్టే గడువు ముగియడంతో రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులు పోలీసుల బందోబస్తు మధ్య ఎక్స్‌కావేటర్లతో భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. కుటుంబ సభ్యులను, సామగ్రిని బయటకు తీసుకువచ్చారు. అక్రమ భవన నిర్మాణాన్ని అధికారులు కూల్చి వేయడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సెట్ బ్యాక్ లేకుండా ఇండ్లు నిర్మించిన కొందరు ఆందోళనకు గురవుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహ నాలు నడుపుతూ రెండోసారి పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు గోదావ రిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ శుక్రవారం మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మూడోసారి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన షేక్‌క్రముద్దీన్‌కు నాలుగురోజుల జైలుశిక్ష విధించారు. మరో ఆరుగురికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను కొడిమ్యాల ఎస్‌ఐ ఎస్ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. కొండాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారివద్ద 6,050రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి



విద్యుత్ వైరుకు తగిలి మృతిచెందిన మల్లేశం, గొర్రెపిల్ల

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇటుకబట్టీలో నేల వాలిన విద్యుత్ వైరుకు తగిలి గొర్రెల కాపరి మృతి చెందాడు. పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేషం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొరెడ్డిపేట గ్రామానికి చెందిన దాగేటి మల్లేశం(30) అనే గొర్రెల కాపరి రోజువారీగా శుక్రవారం గొర్రెలను మేపేందుకు గ్రామశివారులోని ఓ ఇటుక బట్టీ నుంచి వెళుతున్నాడు. ఈ క్రమంలో ఇటుక బట్టీలోని విద్యుత్‌వైరు నేలపై పడి ఉండటంతో అటువైపుగా వెళ్తున్న గొర్రెకు షాక్‌కు గురైంది. గమనించిన గొర్రెలకాపరి మల్లేశం గొర్రెను కాపాడేం దుకు యత్నిస్తుండగా అతను కూడా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన మృతుడి కుటుంబసభ్యులు, గ్రామ స్థులు, యాదవసంఘం నాయకులు పెద్దఎత్తున సంఘటనస్థలం వద్దకు చేరుకొన్నారు. మృతుడి కుటుంబానికి ఇటుకబట్టీ యజమాని న్యాయం చేయాలని, అప్పటివరకు సంఘటన స్థలంనుంచి మృతదేహాన్ని తీయవద్దని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. దీంతో మృతదేహాన్ని పంచనామాకు తరలించకుండా ఎస్‌ఐ మల్లేష్ దర్యాప్తు చేస్తున్నారు. యాదవసంఘం నాయకులు అక్కడికి చేరుకోని మృతుడికి న్యాయంచేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

నష్టపరిహారం కోసం ధర్నా

● రైల్వే పనులను అడ్డుకున్న రైతులు



నష్టపరిహారం కోసం ధర్నా చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నష్టపరిహారం చెల్లించాలని రైతులు ధర్నాకు దిగి రైల్వే పనులను అడ్డుకున్నారు. రైల్వే పనులతో బనప్పచెరువు తెగి పంట నష్టపోయామని పరిహారం చెల్లించాలని తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన రైతులు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామశివారులోని బనప్ప చెరువు మత్తడిని రైల్వే పనుల నిర్వహణలో భాగంగా ధ్వంసం చేశారన్నారు. దీంతో చెరువుకట్ట తెగి రాంచంద్రపూర్ గ్రామం శివారులోని పొలాల్లో పంట ధ్వంసం అయ్యిందన్నారు. సుమారు30 ఎకరాల వరకు పంటనష్టం వాటిల్లిందని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కేర్ టేకర్‌ను తొలగించాలని విద్యార్థినుల ఆందోళన

● వసతి గృహం ఎదుట బైఠాయించి నిరసన



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మాజీద్

గొల్లపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేర్ టేకర్ తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మానిసికంగా వేధిస్తోందని వెంటనే ఆమెను విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి ఆదర్శ వసతిగృహం ఎదుట విద్యార్థినులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఆదర్శ వసతి గృహంలోని విద్యార్థినులు అంతా ఒకేసారి వసతిగృహం మెయిన్ గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కేర్‌టేకర్‌గా విధులు నిర్వహిస్తున్న గోస్కుల సుజాత తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తోందని, తమపై అసభ్యపదజాలం వాడుతూ మానసికంగా వేధిస్తుందన్నారు. వసతి గృహంలోకి ఆలస్యంగా వస్తే తమ వద్ద ఫైన్ వసూలు చేస్తోందని వాపోయారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ మాజీద్ ఆదర్శ పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. కేర్ టేకర్ ఉంటే తాము వసతి గృహం నుంచి ఇళ్లకు పోతామంటూ భీష్మించారు. తహసీల్దార్ కేర్‌టేకర్ సుజాతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ విద్యార్థినులను సముదాయించి వసతిగృహంలోకి పంపించారు. ఏదైన సమస్య ఉంటే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు శాంతించారు. అనంతరం కేర్ టేకర్ సుజాతను తాత్కాలికంగా ఇంటికి పంపించినట్లు అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి ఎంఈవో చెరుకు రాజన్న, స్పెషల్ ఆఫీసర్ పద్మ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఉరి వేసుకుని బాలిక..

ఎండపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెల్గటూర్ ఎస్‌ఐ ఉమాసాగర్ కథనం మేరకు... కొండాపూర్ గ్రామానికి చెందిన వి సహస్ర(15) అనేబాలిక కుమ్మరిపల్లిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం చదువుతోంది. తొమ్మిది సంవత్సరాల క్రితం తనతల్లి జ్యోతి చనిపోయింది. తనతండ్రి రెండోవివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి వారి సంరక్షణలోనే సహస్ర ఉంటోంది. నెల రోజుల క్రితం సహస్రకు ముక్కులో కొవ్వు పెరగగా జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. మళ్లీ తిరిగి హాస్టల్‌కు వెళ్లిపోయింది. వారంరోజుల క్రితం మళ్లీ నొప్పి రావడంతో హాస్టల్ నుంచి ఇంటికి వచ్చింది. గురువారం ఉదయం తన తండ్రి రవి, పినతల్లి ఇద్దరు వారిపనులకు బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో సహస్ర చీరతో దూలానికి ఉరేసుకుని మృతిచెందింది. బాలిక మృతిపై అనుమానం ఉందని మృతురాలి అమ్మమ్మ సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఉమాసాగర్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..



బాబు(ఫైల్)

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఓవ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరిసిల్లఅర్బన్ పరిధిలోని చంద్రంపేట జరిగింది. కుటుంబీ కులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచెం బాబు(39) కులవృత్తిపై ఆధారపడి భార్య లక్ష్మి, ఇద్దరు కుమా రులను పోషిస్తున్నాడు. ఐదునెలల నుంచి బాబుకు కళ్లు కనిపించక వడ్డెర కులవృత్తి చేసుకోవడం ఇబ్బందిగామారింది. దీంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక శుక్రవారం తెల్లవారు జామునఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు..

మల్లాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్‌లో ఏనుగు ప్రతాప్‌రెడ్డి (38) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాప్‌రెడ్డి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో అప్పులు పాలయ్యాడు. అప్పులు ఐదు లక్షల రూపాయల వరకు ఉండగా వాటిని ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురయ్యాడు. తాగుడుకు బానిస అయిన ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఇంటి బయట గల రేకుల షెడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వర్ష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి దుర్మరణం



రవితేజ(ఫైల్)

ఓదెల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రానికి చెందిన ఐలు రవితేజ(25) కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మూడునెలల క్రితం తండ్రిశ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోగా, అప్పటినుంచి మానసికంగా ఆవేదనకు గురవుతూ మద్యానికి బానిసయ్యాడని మృతుడి తల్లి తెలిపారు. ఎనిమిదిరోజుల క్రితం ఇంట్లో పురుగుల మందుతాగగా కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడితల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు. హన్మకొండలో ప్రయివేటు హాస్టల్లో వార్డెన్‌గా పనిచేస్తున్న రవితేజ తండ్రి శ్రీనివాస్ మృతి చెందినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం తండ్రి మూడునెలల మాసికం నిర్వహించిన రవితేజ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నదిలో దూకిన వ్యక్తి కోసం గాలింపు..



మానేరు నదిలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

తంగళ్లపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి వంతెనపై నుంచి మానేరు నదిలో దూకిన కృష్ణ ఆచూకీ కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. శుక్రవారం తెల్లవారు జామునుంచి ఎస్‌ఐ ఉపేంద్రచారి ఆధ్వర్యంలో ఎస్డీఆర్‌ఎఫ్ బృందం సాయంత్రం వరకు గాలించారు. కృష్ణ ఆచూకీ లభ్యం కాలేదు.

ఎక్సైజ్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

● వాహనాల తనిఖీలలో గుడుంబాతో పట్టుబడిన దంపతులు

సుల్తానాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రేగడిమద్దుకుంట వద్ద ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీచేస్తున్నారు. గుడుంబాతో శ్రీనివాస్ అతని భార్య పట్టుబడ్డారు. సంఘటన స్థలంనుంచి శ్రీనివాస్ పారిపోగా ద్విచక్రవాహంతోపాటు గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సుల్తానాబాద్ లోని ఎక్సైజ్ కార్యాలయం చేరుకున్న శ్రీనివాస్ అధికారులను బతిమిలాడుతూ గతంలోనే కేసుల మూలంగా ఆర్థికంగా నష్టపోయానని, కేసు పెట్టవద్దని వేడుకున్నాడు. నిబంధన ప్రకారం తాము కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ పోలీసులు స్పష్టం చేశారు. దీంతో వెంట తెచ్చుకున్న పురుగుల మందును శ్రీనివాస్‌తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. తమను బెదిరించడానికి ఇలా చేశాడని పోలీసులు అంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో చోరీకి యత్నం

● యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

మానకొండూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేట గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చోరీకి యత్నించిన యువకుడికి రైతులు దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగపేట గ్రామ శివారులో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారు జామున ఎవరూ లేని సమయంలో మానకొండూర్‌కు చెందిన జాహిద్‌తో పాటు మరో యువకుడు కొనుగోలు కేంద్రానికి మినీ వ్యాన్‌ను తీసుకెళ్లారు. ధాన్యం కుప్పల నుంచి సుమారు 20కి పైగా సంచులను నింపి అందులో ఎక్కిస్తుండగా దారి వెంబడి వెల్లుతున్న వారు రైతులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అందులోని ఒకరు పరారు కాగా జాహిద్ అనే యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై సీఐ సంజీవ్‌ను వివరణ కోరగా ధాన్యాన్ని దొంగతనం చేసేందుకు యత్నిస్తుండగా రైతులు పట్టుకొని అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాము కాటుతో.. పాములు పట్టే వ్యక్తి మృతి



రాములు(ఫైల్)

మల్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాములు పట్టె వ్యక్తి తాను పట్టుకున్న పాము కాటుతోనే మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల బీసీకాలనీకి చెందిన ఆడపల్లు రాములు(55) అనేవ్యక్తి పాములు పడుతూ ఉంటాడు. ఇందులో భాగంగా ఈ నెల19న ఓవిషసర్పంను పట్టుకొని ఇంటికి తీసుకెళ్లి కోరలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ అదేపాము కుడి చేతిపై కాటువేసింది. వెంటనే అతని భార్య పోచవ్వ చికిత్స కోసం జగిత్యాలకు అక్కడినుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాగాచికిత్స పొందుతూ రాములు శుక్రవారం మృతిచెందగా మృతుడిభార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

భగత్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. రాజు, విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి రవీందర్ విజిలెన్స్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రీజినల్‌మేనేజర్ రాజు మాట్లాడుతూ విజిలెన్స్ అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్‌మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, పి.మల్లేశం, పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎ.శంకరయ్య, ఎల్.మల్లేశం, కె.యుగేంధర్‌రెడ్డి, బి.సత్తయ్య, ఎస్.శ్రీనివాస్, జీపీ సింగ్, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, రాజయ్య, కొమురయ్య, లక్‌పతి, లక్ష్మీరాజం, రమణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు కాశీ క్షేత్రంలో శివ కల్యాణం

వేములవాడ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి పట్టణంలోగల కాశీక్షేత్రంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం శివకల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వేములవాడ క్షేత్రం నుంచి వారణాసిలో శివకల్యాణం నిర్వహించేందుకు ప్రధాన అర్చకులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అయిదుగురు అర్చకులు శుక్రవారం సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. వీరు శనివారం శివకల్యాణం నిర్వహించి తిరిగి వేములవాడకు బయలుదేరుతారు. కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు కాశీక్షేత్రంలో తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు ప్రధాన దేవాలయాలైన యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, ధర్మపురి దేవాలయాల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఆయా దేవాలయాల అర్చకులు కాశీక్షేత్రానికి వెళ్లారు. మూడు రోజులుగా కాశీ క్షేత్రంలో యాదగిరిగుట్ట, భద్రాచలం, ధర్మపురి ఆలయాల అర్చకులు పూజలు చేశారు. చివరగా వేములవాడ దేవస్థానం ఆధ్వర్యంలో శివ కల్యాణం నిర్వహించనున్నారు.



వీరాధి వీరుడే.. వీర మణికంఠుడే..

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదలైన అయ్యప్పల సందడి
- 5న కార్తీక పౌర్ణమి రోజు పెద్ద సంఖ్యలో దీక్షలకు సిద్ధం
- 16 నుంచి మండల పూజ మహోత్సవాలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

స్వామియే శరణం అయ్యప్పా... అంటూ తలపై ఇరుముడితో, మండల దీక్షతో, భక్తినిండిన నయనాలతో శబరిమలకు లక్షలాది మంది భక్తులు తరలివెళ్లే కాలం మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్తీక మాసంతో అయ్యప్ప స్వామి వారి శరణు ఘోష మారుమోగుతోంది. దీక్షాదారుల సందడి ప్రారంభమైంది. కార్తీక పౌర్ణమి వరకు వేలాది మంది దీక్షలు స్వీకరించనుండగా, నవంబరు 5న కార్తీక పౌర్ణమి రోజు భారీ సంఖ్యలో దీక్షలు స్వీకరిస్తారు.

● 1400 కిలోమీటర్ల జిల్లా దీక్షాదారుల పాదయాత్ర

జిల్లా నుంచి అయ్యప్ప స్వాములు కాలినడకన 1400 కిలోమీటర్ల దూరం ఇరుముడితో ప్రతి యేటా పాదయాత్రలు చేస్తున్నారు. ఇప్పటికే దీక్షారులు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కాలినడకన శబరిమలకు మహాపాదయాత్రగా వెళ్లారు. కొందరు మహాపాదయాత్రను ముగించుకొని వచ్చారు. మరోవైపు దీక్షాదారులు సందడి సంక్రాంతి రోజున శబరిమలలో జ్యోతి దర్శనం వరకు కనిపిస్తుంది. జిల్లాలో ఒకరిద్దరితో మొదలైన దీక్ష ఇప్పుడు ప్రతి పల్లెలో, పట్టణాల్లో వేల సంఖ్యలోనే దీక్షలు చేపడుతున్నారు.

● 16న మకరవిలక్కుతో మండల పూజలు ప్రారంభం

శరీరాన్ని మనసును అదుపులో ఉంచుకోని సన్మార్గంలో పయనింపజేసేదే అయ్యప్ప మండల దీక్షగా భావిస్తారు. 41 రోజుల పాటు అయ్యప్పకు ఆత్మనివేదన చేసుకుంటూ నిత్య శరణు ఘోషతో పూజిస్తారు. రోజులో ఒకసారి భిక్ష, మరోసారి అల్పాహారం, రెండుసార్లు చన్నీటి స్నానం, నేలపై నిద్రించాలనే కఠిన నియమాలను ఆచరిస్తారు. ఈనెల 16 నుంచి అయ్యప్ప దేవాలయాల్లో మండల పూజ ప్రారంభమవుతున్న క్రమంలో దీక్షలు పొందడానికి భక్తులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో కార్తీక పౌర్ణమి రోజు వేలాది మంది భక్తులు మాల ధారణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నవంబరు 16వ తేదీన మండల పూజ మహోత్సవంతో సన్నిధానంలో శబరిమల అయ్యప్పస్వామి ఆలయాన్ని తెరుస్తారు. 2026 జనవరి 14న మకరవిలక్కు జ్యోతి దర్శనం ఉంటుంది. మకర విళక్కు దర్శనానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వెళ్తారు.



సిరిసిల్ల అయ్యప్పదేవాలయంలో పడిపూజ (ఫైల్)

● మండల దీక్ష ప్రత్యేకత...

కార్తీక మాసం నుంచి మార్గశిర పుష్య మాసాల వరకు దృఢమైన నియమాలను ఆచరిస్తారు. స్వామి చింతనలోనే సమయం గడపడం సాత్విక జీవనం పాటిస్తారు. దీక్ష, మాల నియమాలను పాటిస్తారు. గురుస్వామి ఉపదేశంతోనే నిత్యం భజన కార్యక్రమాల్లో ఉంటారు. దీక్ష తీసుకున్న వారు ఆత్మను పూర్తిగా స్వామికే నివేదిస్తారు. దీక్షలో ఉన్నంతకాలం తమ గుర్తింపును కోల్పోయి స్వామిగానే పిలువబడుతారు. జాతి, మత, కుల, బీద, ధనిక తారతమ్యాలు వీడి అందరూ ఒకటిగా నిలుస్తారు. నల్లని దుస్తులు ధరిస్తారు. ప్రతి రోజు తెల్లవారు జామునే లేచి కాలకృత్యాలు తీర్చుకొని, చన్నీటి స్నానం చేసి పూజలు చేస్తారు. తిరిగి సాయంత్రం వేళల్లో చలిని లెక్కచేకుండా చన్నీటి స్నానమే చేస్తారు. దీక్ష కాలమంతా కటిక నేలపై పడుకుంటారు. మండల దీక్ష సమయంలో మనస్సును ఇతర వ్యవహారాలపైకి వెళ్లనివ్వకుండా భజనలు చేస్తారు. దీక్షల్లో పడిపూజ ముఖ్యమైంది. 18 మెట్లను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తారు.

అమరుల త్యాగాలు మరువలేనివి: సీపీ

● కరీంనగర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీస్ అధికారులు

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు మరువలేనివని కరీంనగర్ సీపీ గౌస్‌ఆలం అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కరీంనగర్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో మొత్తం 191మంది పోలీసుసిబ్బంది ప్రాణాలర్పించారని తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు పోలీసులు అమరులయ్యారన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ డీసీపీ భీం రావు, కమీషనరేట్‌లోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ రోజే పోస్టింగ్

● కరీంనగర్ ఈఎన్‌సీగా జి అనిల్‌కుమార్

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నరనెలలుగా పోస్టింగ్ లేక వెయిటింగ్‌లో ఉన్న జి అనిల్‌కుమార్‌కు పదవీవిరమణ రోజున ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చి... ఉపశమనం కల్పించింది. కరీంనగర్ ఈఎన్‌సీగా జి అనిల్‌కుమార్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. తాజానిర్ణయంతో వెయిటింగ్ కాలానికి వేతనంతోపాటు పదవీ విరమణ ప్రయోజనాలను కరీంనగర్ ఈఎన్‌సీ పోస్టు నుంచి క్లెయిమ్ చేసుకోవడానికి వెసులుబాటు లభించింది. ఈమేరకు నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక గతజూన్ 16వతేదీన అనిల్‌కుమార్‌ను బదిలీచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఆయన్ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత అదేనెల 21వ తేదీన తనకు పోస్టింగ్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే అనిల్ కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేయనుండటంతో పోస్టింగ్ ఇస్తారా...? లేదా...? అనే దానిపై సందిగ్ధం నెలకొంది. తాజా ఉత్తర్వులతో పోస్టింగ్ ఇవ్వడంతో ఉత్కంఠ వీడింది.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను శనివారం నుంచి నిర్వహించనున్నారు. అండర్-14,17,19 విభాగాల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈపోటీలను నిర్వహించనున్నట్లు జిల్లాపాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్ తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ అర్హత పత్రంతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్, పాఠశాల నుంచి తీసుకున్న స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు.

● క్రీడా పోటీల షెడ్యూల్..

ఉమ్మడిజిల్లాలో జోన్‌లెవల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను అండర్-17విభాగంలో బాలబాలికలకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వఉన్నత పాఠశాల దన్గర్‌వాడిలో శనివారం నిర్వహిస్తారు. ఈ నెల 3న ఉమ్మడి జిల్లాస్థాయిలో హాకీ అండర్-14,17 బాలబాలికలకు హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలమైదానంలో నిర్వహించనున్నారు. అండర్-14,17,19విభాగాల్లో సెపక్‌తక్రా పోటీలను ఉమ్మడిజిల్లాస్థాయిలో బాలబాలికలకు హుజూరాబాద్‌లో నిర్వహిస్తారు. ఉమ్మడిజిల్లాస్థాయిలో అండర్-14,17,19విభాగాల్లో బాలబాలికలకు మల్కాంబ్ పోటీలను హుజూరాబాద్‌లో ఉంటాయి. ఈనెల6వ తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి రగ్బీ పోటీలను అండర్-14, 17, 19 బాలబాలికలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ షూటింగ్ పోటీలను అండర్-14, 17 బాలబాలికలకు జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ స్వదేశ్ షూటింగ్ అకాడమీలో నిర్వహించనున్నారు. ఈనెల 7న ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి జోనల్ సాఫ్ట్ బాల్ పోటీలను అండర్-14 బాలబాలికల విభాగాల్లో చింతకుంట జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ యోగా పోటీలను అండర్-14,17 బాలబాలికలకు వెలిచాల జడ్పీఉన్నతపాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ నెల8న ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ నెట్‌బాల్ పోటీలను అండర్-17 బాలబాలికలకు చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాలలో, ఈ నెల 10న ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఈ నెల 11న కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి స్క్వాష్, సాఫ్ట్ టెన్నిస్ పోటీలను అండర్-14, 127, 19 బాలబాలికల విభాగాల్లో కరీంనగర్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తారు.

● కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలు..

ఈనెల 2న కరీంనగర్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను అండర్-17 బాలబాలికల విభాగాల్లో కరీంనగర్‌లో నిర్వంచనున్నారు. ఈ నెల 4న కరీంనగర్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను అండర్-14 బాలురకు మల్కాపూర్ రోడ్‌లోని చాంపియన్స్ క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తారు.

మళ్లీ తెరుచుకున్న ఎల్‌ఎండీ గేట్లు

తిమ్మాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయం గేట్లు గురువారం రాత్రి 7.30గంటలసమయంలో మూసివేయగా భారీగా ఇన్‌ఫ్లో వస్తుండటంతో శుక్రవారం ఉదయం ఎల్‌ఎండీ 4గేట్లుతెరచి 8వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తిరిగి మధ్యాహ్నం 1.30గంటల సమయంలో మరో రెండుగేట్లు తెరచి మొత్తం 6గేట్ల నుంచి 16వేల క్యూసెక్కులు, తరువాత22వేల క్యూసెక్కులకు పెంచి విడుదల చేస్తున్నారు. మోయతుమ్మెద వాగునుంచి 14,275 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 500క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువనుంచి 320క్యూసెక్కులు మొత్తం15,095 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తోంది. 6గేట్ల నుంచి 22వేల క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 277 క్యూసెక్కులు మొత్తం 22,277క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతున్నట్లు అధికారులు వెల్లడించారు. రాత్రి 9గంటలకు ఇన్‌ఫ్లో 10,332 క్యూసెక్కులకు తగ్గడంతో అధికారులు రెండు గేట్లు మూసివేశారు. ప్రస్తుతం నాలుగు గేట్ల నుంచి నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయం నుంచి 12,277 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది.



నిండుగా ఉన్న ఎల్‌ఎండీ

గురుకులాలను గాలికి వదిలేసిన ప్రభుత్వం

- శ్రీవర్షిత మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

హుజూరాబాద్, అక్టో బరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురు కుల పాఠశాలలను గాలి కి వదిలేసిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. వంగర గురుకులహాస్టల్‌లో శ్రీవర్షిత ఉరేసుకొని మృతిచెందగా శుక్రవారం రాత్రి విద్యార్థిని కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వర్షిత మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని హాస్టళ్లలో సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన విద్యాబోధన, ఉపాధ్యాయులు, భోజనం, సదుపాయలు తదితర ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. హాస్టళ్లలో సరైన పట్టింపులేకనే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులు తూతూ మంత్రంగా ఎంక్వైరీ చేస్తున్నారనే తప్ప కారణాలను లోతుగా అన్వేషించడం లేదన్నారు. చదువు, పరీక్షల పట్ల ఎప్పుడు టెంక్షన్ లేని శ్రీవర్షిత ఎందుకు ఆత్మహత్య చేసుకుందో ఇప్పటివరకు తెలియలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి మృతికిగల కారణాలను లోతుగా పరిశీలించాలన్నారు. మృతికి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

● మొంథా తుఫాను చాలా భయంకరమైనది..

మొంథా తుఫాను చాలా భయంకరమైన తుఫాను అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం రాత్రి హుజూరాబాద్ మండలంలోని జూపాక గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పెద్దఎత్తున వర్షాలు వస్తాయనే ఆస్కారం ఉందని పక్క రాష్ట్రమైనా ఆంధ్రప్రదేశ్ ముందస్తుగా చర్యలు చేపట్టిందన్నారు. కానీ మన తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో భారీ ఎత్తున నష్టం జరిగిందన్నారు. కురిసిన వర్షానికి వందల వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అలాగే రోడ్లు బొందలగడ్డగా మారాయన్నారు. ఇప్పటివరకు పంటనష్టం సర్వేచేసే నాథుడు లేడన్నారు. ఎకరాకు రూ.10వేలు ఇస్తే ఏ మూలకు సరిపోతుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే నష్టపోయిన రైతులకు రూ.25వేలు వరిపంటకు, రూ.40వేలు పత్తి పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు.

పీఆర్టీయూ సోషల్ మీడియా రాష్ట్రకమిటీ సభ్యుడిగా లక్ష్మీనారాయణ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (పీఆర్టీయూటీ) రాష్ట్ర సోషల్‌మీడియా కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన వేముల లక్ష్మీనారాయణను నియమించినట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, భిక్షంగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేముల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్రకమిటీలో స్థానం కల్పించినం దుకు రాష్ట్ర బాధ్యులకు, నియమకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర బాధ్యులకు కృత జ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్‌రెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డి, అబ్దుల్ జమీల్, తిరుపతి రెడ్డి, నాగేశ్వర్‌రావుతదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక సందడి..

- ధర్మపురి వద్ద గోదావరి నదిలో దీపాలు వదిలిన మహిళలు
- ఉసిరిక చెట్టు వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు
- వేములవాడ భీమన్న సన్నిధిలో కార్తీక భక్తుల రద్దీ

ధర్మపురి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి మహిళలు నదిలో వదిలారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం జరిపించారు. గోదావరి మాత, సంతోషీమాత, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణలు చేసి, లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో లఘు దర్శనం..

వేములవాడ టౌన్ : కార్తీక మాసోత్సవం సందర్భంగా వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం సుహాసినీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి కోడె మొక్కులు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా రాజరాజేశ్వర స్వామివారిని భక్తులు లఘు దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మండపంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.



ధర్మపురిలో ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నేడు అర్బన్ బ్యాంకు ఎన్నికలు

- 34 పోలింగ్ కేంద్రాలు.. 150 మంది ఎన్నికల నిర్వహణకు సిబ్బంది
- కరీంనగర్‌లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- జగిత్యాల బాలికల జూనియర్‌కళాశాలలో పోలింగ్ స్టేషన్లు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 12 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గ ఎన్నికలకు కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న పోలింగ్‌లో 9,287 మంది బ్యాంకు సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కరీంనగర్‌లోని ఏడు వేల ఓటర్ల కోసం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 24 పోలింగ్ స్టేషన్లను, జగిత్యాలలోని రెండువేలపైచిలుకు ఓటర్లకోసం ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 150 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ సిబ్బందిని ఎన్నికల విధుల కోసం నియమించారు. బందోబస్తు మధ్య పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రితో సిబ్బందిని జగిత్యాలకు తరలించారు. మొత్తం 12 మంది డైరెక్టర్ పదవుల కోసం 54 మంది పోటీ పడుతున్నారు.

● బరిలో మూడు ప్యానెళ్లు

పాలకవర్గంలో 12 స్థానాల్లో ఒకటి ఎస్సీ ఎస్టీకి కేటాయించగా ఎనిమిది మంది, రెండు మహిళా స్థానాలకు ఐదుగురు, తొమ్మిది జనరల్ స్థానాలకు 41 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మద్దతుతో నిర్మలా భరోసా ప్యానల్ పోటీలో నిలిచింది. మరో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ పార్టీలకతీతంగా 12 మందితో ఇండిపెండెంట్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి హోరాహోరీగా ప్రచారాన్ని నిర్వహించారు. మరో 18 మంది ప్యానల్స్‌తో నిమిత్తం లేకుండా స్వతంత్రులుగా పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలేవి కూడా ప్రత్యక్షంగా ఈ ఎన్నికల్లో పాల్గొనలేదు. కాంగ్రెస్ కూడా అధికారికంగా తమ పార్టీ ప్యానల్‌ను బరిలో నిలుపలేదని ప్రకటించింది. కరీంనగర్ కేంద్రంగా ఉన్న అర్బన్ బ్యాంకుకు జగిత్యాలలో బ్రాంచి ఉండడంతో అక్కడి నుంచి కూడా కొంత మంది డైరెక్టర్లుగా పోటీ చేస్తున్నారు.



బ్యాలెట్లను సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

● నేడే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరీంనగర్, జగిత్యాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల అనంతరం జగిత్యాల పోలింగ్ కేంద్రం నుంచి కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రానికి పోలింగ్ బాక్సులను తరలించి, ఇక్కడే ఓట్లను లెక్కిస్తారు. అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు.

● ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోండి

- ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్

కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలకు ఏర్పాటు పూర్తి చేశాము. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటర్లు తమ బ్యాంకు గుర్తింపుకార్డు లేదా ఆధారుకార్డు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన గుర్తింపుకార్డులతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. దివ్యాంగులు, వృద్దుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఎస్సీ, ఎస్టీ డైరెక్టర్ స్థానానికి పింక్, మహిళా డైరెక్టర్‌కు బ్లూ, జనరల్ స్థానాలకు వైట్ బ్యాలెట్ పత్రాలు ఉంటాయి. ఒక్కో సభ్యుడు ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో ఒకటి, మహిళలకు రెండు, జనరల్‌లో తొమ్మిది ఓట్లను వినియోగించుకోవచ్చు. పోలింగ్ పూర్తయిన తర్వాత కరీంనగర్, జగిత్యాలలోని 31 పోలింగ్ స్టేషన్ల నుంచి బాక్సులను మహిళా డిగ్రీ కళాశాలలోని సమావేశ మందిరానికి చేర్చి ఓట్లను లెక్కిస్తాము. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను వెల్లడిస్తాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి.

శ్రీరాంసాగర్‌కు 80,042 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం శుక్రవారం కొనసాగింది. ఎగువప్రాంతం నుంచి 80,042 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరదగేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 70,588 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) శుక్రవారం 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూలవాగు, వరద కాలువ ఇన్‌లెట్స్ ద్వారా వరద నీరు వచ్చి చేరుతోంది. అయితే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు ఒకగేట్ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.74 ఉండగా, సామర్థ్యం 27.55టీఎంసీలకు 26.888 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

జగిత్యాల అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని మార్కండేయనగర్‌కు చెందిన దగ్గు లక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన 60 వేల రూపాయల చెక్కును జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం అందజేశారు. జగిత్యాల రూరల్ మండలం అనంతరం గ్రామానికి చెందిన గారె రాజవ్వకు మోకాలి శస్త్ర చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి 1.50 వేల విలువ గల ఎల్వోసిని అందజేశారు. కార్యక్రమంలో మహేందర్, గాదె రాజన్న, ఏనుగుల రాజు, గంగన్న పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సారంగాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం మండల వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేష్ రైతులతో కలిసి పరిశీలించారు. మండలంలోని సారంగాపూర్, పోతారం, బట్టపెల్లి గ్రామాల్లో వర్షానికి నేలవాలిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల వారీగా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

● రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని పొలాస శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాణ్యమైన విత్తన కార్యక్రమంలో భాగంగా సారంగాపూర్ గ్రామానికి చెందిన రైతు తిరుపతిరెడ్డి సాగు చేసిన వరి పంటను పరిశీలిచారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ జగిత్యాల శాస్త్రవేత్తలు, ఏఈవో వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

1061 ఎకరాల్లో వరి పంట నష్టం

మల్లాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో 1061 ఎకరాల మేర వరి పంటకు నష్టం వాటిల్లిందని, ప్రాథమిక నివేదికను పంపినట్లు మల్లాపూర్ ఏవో లావణ్య ఒక ప్రకనలో తెలిపారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ధర్మపురిలో..

జగిత్యాల అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాధీ భారత జాతి కోసం చేసిన ప్రాణత్యాగం వెలకట్టలేనిదని జగిత్యాల ఎమ్మెల్యే డాకర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు కోల శ్రీనివాస్, ఏనుగు మల్లారెడ్డి, నక్కల రవీందర్ రెడ్డి, చెటిపెల్లి సుధాకర్, రామ్మోహన్ రావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జీవితం మార్గదర్శకం

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం మార్గదర్శకమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి పాత బస్టాండ్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కండ్లపెల్లి దుర్గయ్య, తాటిపర్తి రామచంద్రారెడ్డి, బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, నాయకులు సింహరాజు ప్రసాద్, బొల్లారపు పోచయ్య, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజేందర్, ప్రసాద్, స్వామి, గంగయ్య, చంద్రమోహన్‌రెడ్డి, నర్సయ్య, రవి, జితేందర్‌రెడ్డి, రమేష్, నారాయణ ఉన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, తిరుపతి, మల్లారెడ్డి, స్వామి, కిషన్, భాస్కర్, అంజయ్య, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పట్టణ, మండల, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజరెడ్డి, మ్యాకల రమేష్, ప్రధానకార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్, నాయకులు తంగెళ్ల రమేష్, ఎద్దండి భూమారెడ్డి, కొయ్యడి మహిపాల్, దాసరి గంగాధర్, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య, షాకీర్, శ్రీకాంత్, కొమ్ముల ఆదిరెడ్డి, మోబిన్, రాకేష్ నాయక్, భూమాగౌడ్, తలారి రాజేష్, మండ రమేష్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు, మొగిలిపేట, రాఘవపేట, రత్నాపూర్, గుండంపల్లి తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొడిమ్యాలలో..



రాయికల్‌లో..

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

ముఖగుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటి నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం, విద్యార్థి విధిగా తరగతులకు హాజరయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

● పాఠ్యాంశాల వారీగా..

వార్షిక పరీక్షలకు మూడు నెలల సమయం ఉండటంతో పాఠ్యాంశాల వారీగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. నిర్ణీత సమయాల్లో పరీక్షలు నిర్వహించి ప్రతీ విద్యార్థి స్థాయిని అంచనా వేస్తున్నారు. వెనుకబడిన వారిని, ముందున్న వారితో సమానం అయ్యేందుకు ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా పరీక్షల సమయం వరకు అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రతీ లెక్చరర్ దృష్టి సారించేలా ఇంటర్ బోర్డు ప్రయత్నాలు చేస్తోంది.

● మరిన్ని కార్యక్రమాలు....

డిసెంబరు నెలాఖరుకు సిలబస్ పూర్తి చేయడం, ప్రతీ కళాశాలను డీఐఈవోలు తనిఖీ చేస్తూ ప్రిన్సిపాల్స్ అధ్యాపకులకు పలు సూచనలు చేయనున్నారు. అకాడమిక్ గైడెన్స్, మానిటరింగ్ సెల్ ద్వారా కేర్ టేకింగ్ పద్ధతిలో ఒక్కో లెక్చరర్‌కు కొంత మంది విద్యార్థులను అనుసంధానం చేస్తారు. ఆ విద్యార్థులు అన్ని సబ్జెక్ట్‌లో ఉత్తీర్ణత సాధించేలా చేసే బాధ్యత ఆ లెక్చరర్లపైనే ఉంటుంది.

● ఒత్తిడి అధిగమించేలా యోగా....

విద్యార్థులు మానసికంగా ఒత్తిడి గురికాకుండా ఉండడంతో పాటు మత్తుపదార్థాలతో కలిగే నష్టాలపై అవగహన కల్పనకు ప్రతీ కళాశాలలో ఒక లెక్చరర్ కౌన్సిలర్‌గా నియమించారు. విద్యార్థులు అధికంగా ఉంటే మరొకరిని నియమించుకోవచ్చు. ఒత్తిడికి గురయ్యే విద్యార్థులను పర్యవేక్షిస్తూ దాని నుంచి బయటపడేలా చూస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము..

- బొప్పరాతి నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి



జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని రకాల కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నాం. తరగతులకు సరిగా హాజరుకాని విద్యార్థులపై దృష్టిసారించాం. ముఖ గుర్తింపు హాజరు విధానం మంచి ఫలితానిస్తోంది. కళాశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు సంబంధించి ఇంటర్ విద్యాశాఖ దృష్టి సారించింది. శనివారం నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తున్నాము. ఇంటర్ బోర్డు నిర్ణయం మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ ప్రకాష్ రైతులకు సూచించారు. కోరుట్ల పశువైద్య కళాశాల విద్యార్థులతో మండలంలోని వేంపేట గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్ ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి ప్రకాష్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ మూగ జీవాలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి పశుపోషకులు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, మనీషాపటేల్, స్రవంతి, ప్రొఫెసర్లు డాక్టర్లు గోపాలకృష్ణ, విశాల్‌కుమార్, సురేష్, మల్లేష్, రవికాంత్, సిబ్బంది రమణయ్య, రవి, గంగాధర్, దిలీప్, చిరంజన్, మోహన్ పాల్గొన్నారు.



వేంపేటలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రకాష్

పెగడపల్లి: మండలంలోని కొండయ్యపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కిష్టంపేటలో 120 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అదనపు పశు వైద్య శస్త్ర చికిత్సకుడు డాక్టర్ నరేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు మిర్యాల నాగేందర్‌రెడ్డి, వాసం శివకుమార్, కార్యాలయ సహాయకులు షేక్ అహ్మద్, పోచయ్య, రైతులు వెంకట సుబ్బారావు మహేష్, వెంకటేశం, మందుల రాజం పాల్గొన్నారు.

తేమశాతం వచ్చేదాకా ధాన్యాన్ని ఆరబెట్టాలి

- అదనపు కలెక్టర్ లత



మల్యాలలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కొడిమ్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ వచ్చేదాకా ఆరబెట్టాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత రైతులకు సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యంలో తప్పతాలు లేకుండా చూడాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని కమిటీ వారికి సూచించారు. ధాన్యం తూకం వేయగానే వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అంతకు ముందు ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం డి మల్లేశం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహస్వామి, ఆర్ఐ రాజారాం, సీఎస్‌డీటీ కె విష్ణు, సీసీ శ్రీనివాస్, వీవోఏ అన్నపూర్ణ, కొనుగోలు కమిటీ సభ్యులు, రైతులు ఉన్నారు.

మల్యాల: మల్యాల వ్యవసాయ మార్కెట్‌లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బీఎస్ లత శుక్రవారం సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకొని ధాన్యం కుప్పలపై కప్పుకోవాలని రైతులకు సూచించారు. తహసీల్దార్ వసంత, ఆర్ఐ తిరుపతి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

సోలార్ టెక్నీషియన్ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

రాయికల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో టాటా స్త్రైవ్ సెంటర్ అమ్మక్కపేట గ్రామంలో సోలార్ టెక్నీషియన్ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు జగిత్యాల జిల్లా స్కిల్ కమిటీ సభ్యుడు, ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. ఈ కోర్సుకు మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుందన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 18-30 సంవత్సరాల్లోపు వయస్సు గల నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9963347142లో సంప్రదించాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రాయికల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి కోరారు. రాయికల్ పట్టణంలోని కొనుగోలు కేంద్రంలో భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పంట నష్టాన్ని అంచనా వేసి రూ.40 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కునారపు భూమేష్, ఉపాధ్యక్షులు అల్లె నర్సయ్య, సింగని సతీష్, ఎల్లాగౌడ్, కార్యదర్శి చంద రమేష్, కైరం సుదర్శన్, మచ్చ శంకర్, ఐటీ సెల్ కన్వీనర్ కట్కం కిషోర్ పాల్గొన్నారు.

ఎకరానికి 20వేల పరిహారం అందించాలి

కథలాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే ఎకరానికి 20,000 రూపాయల పరిహారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు శీలం మోహన్ రెడ్డి, పోతు శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన పంటలకు బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి సేవలు ఎనలేనివి

పెగడపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి ఎంపీడీఓగా ఎ. శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెగడపల్లి ఎంపీడీవోగా 20 నెలలు పని చేసి బదిలీపై కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలానికి వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులు, రాజకీయ పార్టీల నాయకులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, కడారి తిరుపతి, అమిరిశెట్టి లక్ష్మీనారాయణ, అంజయ్య, పూసాల తిరుపతి, సంధి మల్లారెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



రాజారాంపల్లిలో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్

పెగడపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడొద్దని పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ పేర్కొన్నారు. అకాల వర్షాలతో నేలకొరిగిన వరిపొలాలను, కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని శుక్రవారం తహసీల్దార్ ఆనంద్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌తో కలసి రాములు గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో గిర్దావర్ శ్రీనివాస్, నాయకులు, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా తూకం వేయాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మ్యాచర్ వచ్చిన వాటిని వెంట వెంటనే తూకంవేసి మిల్లులకు తరలించాలని తహసీల్దార్ నీత నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మెట్లచిట్టాపూర్, అల్లూరిసీతారామ తండా, ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు, మ్యాచర్‌ను పరిశీలించి తడిసిన ధాన్యం వివరాలు రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉమేష్, ఐకేపీ ఏపీఎమ్ అశోక్, సీసీలు అశోక్, సూరయ్య, శ్రీనివాస్, వీవోఏలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పట్టణాభివృద్ధి

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, కేంద్ర నిధులతోనే పట్టణ అభివృద్ధి కొనసాగుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ అన్నారు. పట్టణంలోని నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల పట్టణానికి రూ.62కోట్లు విడుదల అయ్యాయని, అందులో కేంద్రప్రభుత్వం రూ. 50కోట్లు విడుదలచేయగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.12కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అధికార కాంక్షతో కాకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ బాధ్యులు ఇట్నేని రమేష్, జుంబర్తి దివాకర్, ఆముదరాజు, సిరికొండ రాజన్న, ముద్దం రాము, కొప్పు భాస్కర్, ఇట్యాల రాము, సంతోష్, సాగర్, జీవన్, గంగారెడ్డి, రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 31 ఆంధ్రజ్యోతి): మండలంలోని యామాపూర్, ఫకీర్ కొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, మండల నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఐకేపీ ఏపిఎం అన్నం శంకర్, నాయకులు ఎలాల వెంకటరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నేరెళ్ల దేవేందర్, గంగాధర్, తిరుపతిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఆనంద్, మహేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తుర్తి, పోతారం, గంభీర్‌పూర్, తాండ్రాల్‌లలో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్‌నారాయణరెడ్డి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పులి శిరీష-హరిప్రసాద్, సీఈఓలు అరుణ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మేడిపల్లి: మేడిపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో తొంబర్రావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ మేనేజర్ లక్షయ్య, సీఈవో బొందయ్య, ఏఈవో రాధ, సొసైటి కోశాధికారి గాయత్రి, రైతులు తదితరులు పాలొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఏఖీన్‌పూర్‌లో శుక్రవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

బీర్‌పూర్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులపై విద్యార్థులకు ఉత్తమ రైతు అవార్డుగ్రహీత మిట్టపెల్లి రామన్న తదితరులు అవగాహన కల్పించారు.

జగిత్యాల అగ్రికల్చర్: పట్టణంలోని స్థానిక చింతకుంట చెరువు సమీపంలో గల సూర్యధన్వంతరి ఆలయంలో ధనలక్ష్మీ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీకమాస శుక్రవారం సందర్భంగా కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు.

మల్లాపూర్: మండంలోని ఓబులాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించగా ఆర్ఐ రాజేష్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని రాఘవ పట్నంలో ఇద్దరు నిరుపేద వ్యక్తులు వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందగా రాఘవపట్నం, రంగదాముని పల్లె గ్రామాల ప్రజలు ఆర్‌జీపీ సేవా సమితి ఆధ్వర్యంలో రూ. 1.10 లక్షల మొత్తాన్ని బాధిత కుటుంబాలకు అందించి శుక్రవారం అండగా నిలిచారు.

ధర్మపురి: కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదో రోజు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం

కోరుట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలోని కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి పాత మున్సిపల్ వరకు పారిశుధ్య, మధ్యాహ్న, బీడి కార్మికులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ పతాకం ఎగరవేసి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం, ఉపాధ్యక్షులు వెన్న మహేష్, హన్మంత్, చోప్పరి గంగాధర్, అంకుష్ సరస్వతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కోరుట్ల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ వెంకటేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతుంది. శనివారం నుంచి 7వ తేదీ వరకు జరిగే వేడకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తిక మాసం పురస్కరించుకుని దేవాలయం ప్రతి సంవత్సరం బ్రహోత్సవాలు నిర్వహిస్తుంటారు. బ్రహోత్సవాలను వేదపండితులు మాదవాచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభిస్తారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుండి స్వామి వారి ఉత్సవ మూర్తుల శోభయాత్రను నిర్వహించి వేడుకలను ప్రారంభించనున్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థినుల నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఐక్యత కోసం కృషిచేసిన మహనీయుడు సర్దార్ వల్లాభాయి పటేల్ అని, ఆయన సేవలు మరువలేనివని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కొనియాడారు. సర్దార్ వల్లాభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో సర్దార్ వల్లాభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరి నాగభూషణం, నక్కల రవీందర్‌రెడ్డి, కోలా శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: జాతీయ ఐక్యతకు పునాది వేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కే దక్కుతుందని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కొత్తబస్టాండ్ చౌరస్తాలో గల పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత్ సురక్షా సమితి బాధ్యులు కాశీనాథం, చిట్ల గంగాధర్, అరవ లక్ష్మి, సింగం గంగాధర్, శ్రీనివాస్, ఆశోక్, దేవరాజం, మల్లిఖార్జున్, బాలన్న, రవీంధర్ రావు, బొందుకూరి శ్రీనివాస్, భూమన్న పాల్గొన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, బీజేపీ వివిధ హోదాల బాధ్యులు వడ్డేపల్లి శ్రీనివాస్, తుకారంగౌడ్, పిల్లి శ్రీనివాస్, జుంబర్తి దివాకర్, సాంబారి కళావతి, పాత రమేష్, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, సోషల్ మీడియా కన్వీనర్ సుంచు సురేష్, పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, కార్యదర్శి ఆముద రాజు, ఇట్నేని రమేష్, జంబుక శివ, రాగిల్ల సత్యనారాయణ, కాయితి శంకర్ తదితరులు ఉన్నారు.

పోలీసుల ఘన నివాళి

జగిత్యాల టౌన్: సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రీయ ఏక్తా ప్రతిజ్ఞ చేశారు. డీఎస్పీలు రఘుచందర్, రాములు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, పోలీసులు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ కె వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. భాస్కర్, అధ్యాపకులు జైపాల్‌రెడ్డి, ప్రమోద్, బాలక్రిష్టారెడ్డి, జయశీల, అనిల్, తిరుపతి, నర్సయ్య, సుమన్, శ్యాంకుమార్, దీక్షిత వలంటీర్లు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో జరిగిన వేడుకల్లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కార్యదర్శి బెజ్జారపు లవణ్, వీహెచ్‌పీ జిల్లా కన్వీనర్ కస్తూరి రాజన్న, నలవెల్లి సుజన్‌రెడ్డి, తిరుమన్‌దాసు సత్యనారాయణ, వెలగందుల రవి, ఒగేటి అంజయ్య, ఆకుల శ్రీనివాస్, పల్లెర్ల సురేందర్, శ్యాంసుందర్, శేఖర్, శ్రీనివాస్, మూర్తి, మధుసూదన్, రాకేష్, సూరజ్, శ్రీనివాస్, నాగులు, శివసాయి, రాజు, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేటలో జరిగిన వేడుకల్లో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, పటేల్ యూత్ అధ్యక్షుడు కోల రాజు, భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి జిల్లా సభ్యుడు రావుల లింగారెడ్డి, వీహెచ్‌పీ సత్సంగ్ కాయతి గంగాధర్, బూత్ అధ్యక్షుడు ఎనుగంటి నాగరాజు, నాయకులు రాజశేఖర్, రవి రాజ్, ఎనుగంటి శంకర్, భూమేష్, రమేష్, బేతి మల్లారెడ్డి, గణేష్, నాగిరెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో నిర్వహించిన వేడుకల్లో యువజన సంఘ నాయకులు గాందారి శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, చితికూరి మహేష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: దేశ సమైక్యత కోసం పోరాడిన ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. వెటర్నరీ కళాశాల విద్యార్థులు మండలంలోని వేంపటే గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు మనీషాపటేల్, స్రవంతి, గోపాలకృష్ణ, విశాల్‌కుమార్, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.





పటేల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, రాయికల్‌లో నాయకులు..